నమస్తే తెలంగాణ
మంచిర్యాల
కుమ్రం భీం ఆసిఫాబాద్
5 బుధవారం 21 ఆగస్టు 2024 MANCHERIAL KUMURAM BHEEM ASIFABAD

## రిస్క్ బేస్డ్ ఇంటర్నల్ ఆడిట్ బృందం పర్యటన



జీపీలో రికార్డులు పరిశీలిస్తున్న ఆడిట్ బృందం

జైనూర్, ఆగస్టు 20 : మండలంలోని పవర్‌గూడ, రాసిమెట్టలో మంగళవారం రిస్క్ బేస్డ్ ఇంటర్నల్ ఆడిట్ బృందం పర్యటించింది. ఉపాధి హామీ పనులు, కార్యాలయంలోని రికార్డులను పరిశీలించారు. అనంతరం గ్రామ పంచాయతీల్లోని పల్లె ప్రకృతి వనం, ఫారం పాండ్, సెగ్రిగేషన్ షెడ్, రోడ్డుకు ఇరువైపులా మొక్కల పెంపకం, ఫిష్‌పాండ్, సోక్‌పిట్స్ తదితర పనులు, వాటికి సంబంధించిన రికార్డులను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో రిస్క్ బేస్డ్ ఇంటర్నల్ బృందం నుంచి వెంకటేశ్ జాదవ్, కే నర్సింహులు, ఎంపీడీవో ప్రవీణ్‌కుమార్, అదనపు కార్యక్రమ అధికారి నగేశ్, ఈసీ అంకూస్, టీఏలు రాజలింగు, గులాబ్ సింగ్, లింగేశ్వర్, ఆత్మారాం, రవీందర్, వెంకటేశ్, కార్యదర్శులు భారత్, రవీందర్, ఫీల్డ్ అసిస్టెంట్‌లు ఉత్తమ, రవి, బాబు, మనోహర్, అంబాజీ పాల్గొన్నారు.

## ప్రత్యేకాధికారులకు షోకాజ్ నోటీసులు

చింతలమానేపల్లి, ఆగస్టు 20 : ఈ నెల 17న సీజనల్ వ్యాధుల నివారణ కోసం కలెక్టర్ వెంకటేశ్ ధోత్రే జూమ్ మీటింగ్ నిర్వహించగా, గైర్హాజరైన చింతలమానేపల్లి మండల ప్రత్యేకాధికారి, జిల్లా వ్యవసాయాధికారి శ్రీనివాస్‌రావుకు కలెక్టర్ నోటీసు జారీ చేశారు. అలాగే పెంచికల్‌పేట్ మండల ప్రత్యేకాధికారి, కాగజ్‌నగర్ ఇరిగేషన్ ఈఈ ప్రభాకర్‌రావు, దహెగాం మండల ప్రత్యేకాధికారి, ఆర్‌అండ్‌బీ ఈఈ పెద్దన్నకు షోకాజ్ నోటీసులు జారీ చేస్తూ రెండు రోజుల్లో వివరణ ఇవ్వాలని, లేదంటే చర్యలు తప్పవని హెచ్చరించారు. కాగా, ప్రత్యేకాధికారులుగా బాధ్యతలు చేపట్టిన తర్వాత మండలాల వైపు రాని వారు ఇకనైనా సమర్థవంతగా బాధ్యతలు నిర్వహించాలని ప్రజలు కోరుతున్నారు.

## నేడు నిరసన ర్యాలీ

మంచిర్యాల (ఏసీసీ), ఆగస్టు 20 : రుణమాఫీ కోసం భారతీయ కిసాన్ సంఘ్ ఆధ్వర్యంలో బుధవారం ఉదయం పట్టణంలోని ఐబీ చౌరస్తా నుంచి కలెక్టరేట్ వరకు ర్యాలీ తీస్తామని, కలెక్టర్‌కు వినతిపత్రం అందిస్తామని ఆ సంఘం జిల్లా అధ్యక్షుడు గుంటక సత్యనారాయణరెడ్డి ఓ ప్రకటనలో తెలిపారు. జిల్లా కేంద్రాల్లో నిరసన ర్యాలీ చేపడుతున్నట్లు పేర్కొన్నారు. రైతులు పెద్ద సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

## ఆదిమ గిరిజనుల అభివృద్ధికి ప్రత్యేక చొరవ

### కేంద్ర గిరిజన మంత్రిత్వ శాఖ సంచాలకుడు వైభవ్ గోయల్



వీసీలో పాల్గొన్న కలెక్టర్ వెంకటేశ్ ధోత్రే

ఆసిఫాబాద్ టౌన్, ఆగస్టు 20 : దేశంలోని ఆదిమ గిరిజనుల అభివృద్ధికి ప్రత్యేక చొరవ తీసుకుంటున్నట్లు కేంద్ర గిరిజన మంత్రిత్వ శాఖ సంచాలకుడు వైభవ్ గోయల్ అన్నారు. మంగళవారం న్యూఢిల్లీ నుంచి ఉన్నతాధికారులతో కలిసి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా అన్ని జిల్లాల కలెక్టర్లతో ప్రధానమంత్రి జన్ మన్ పథకం నిర్వహణపై సమీక్ష నిర్వహించారు. కేంద్ర మంత్రి మాట్లాడుతూ అర్హులైన గిరిజనులందరికీ పథకం ఫలాలు అందేలా అధికారులు కృషి చేయాలన్నారు. జిల్లాలో 3,615 గృహాల నిర్మాణానికి కృషి చేస్తున్నామని, గిరిజన గ్రామాలను జిల్లా కేంద్రానికి అనుసంధానం చేస్తూ రహదారుల నిర్మాణానికి చర్యలు తీసుకుంటున్నామన్నారు. ఆదిమ గిరిజనుల ఆవాసాలకు సురక్షితమైన తాగునీటిని అందించడం కోసం ప్రత్యేక చర్యలు చేపడుతున్నామని, ప్రత్యేక వైద్య శిబిరాలు నిర్వహించి వైద్య సేవలు అందిస్తామని తెలిపారు. ఆరోగ్య ఉప కేంద్రాలు, పాఠశాల భవనాలు నిర్మించి విద్యార్థులకు పోషకాహారం అందిస్తామని చెప్పారు. వీడియో కాన్ఫరెన్స్‌లో కలెక్టర్ వెంకటేశ్ ధోత్రే, జిల్లా వైద్య, ఆరోగ్యశాఖ అధికారి తుకారాం, జిల్లా గిరిజనాభివృద్ధి శాఖ అధికారి రమాదేవి ఉన్నారు.

## సైబర్ నేరాలపై అవగాహన అవసరం

### ఆసిఫాబాద్ ఎస్పీ శ్రీనివాసరావు



మాట్లాడుతున్న ఎస్పీ డీవీ శ్రీనివాస రావు

ఆసిఫాబాద్ టౌన్, ఆగస్టు 20 : సైబర్ నేరాలపై అవగాహన అవసరమని, బాధితులుంటే ట్రోల్ ఫ్రీ నంబర్ 1930లో సంప్రదించాలని ఎస్పీ డీవీ శ్రీనివాస రావు అన్నారు. మంగళవారం జిల్లా కేంద్రంలోని వొడ్డెపెల్లి గార్డెన్‌లో డీఎస్పీ సదయ్య, జిల్లా సైబర్ సెక్యూరిటీ డీఎస్పీ రమేశ్ ఆధ్వర్యంలో నిర్వహించిన సైబర్ నేరాల అవగాహన సదస్సుకు ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఎస్పీ మాట్లాడుతూ ఆన్‌లైన్ మోసాలు, సైబర్ నేరాలపై విద్యార్థులకు అవగాహన అవసరమన్నారు. మొబైల్స్‌కు వచ్చే అనుమానిత లింక్స్‌ను క్లిక్ చేయవద్దని, ఎవ్వరికీ ఓటీపీ షేర్ చేయవద్దని సూచించారు. సైబర్ నేరాలకు గురికాకుండా ఉండాలంటే ప్రధానంగా లోన్ యాప్‌లకు దూరంగా ఉండాలని, కస్టమర్ కేర్ నంబర్లను గూగుల్‌లో అస్సలు వెతకవద్దని, ఫేస్‌బుక్, వాట్సప్ ద్వారా వచ్చే వీడియో కాల్స్‌కు స్పందించవద్దని చెప్పారు. అనంతరం ఎల్‌ఈడీ స్క్రీన్ ద్వారా సైబర్ నేరాలపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో జిల్లా అడిషనల్ ఎస్పీ అడ్మిన్ ప్రభాకర్ రావు, డీఎస్పీలు సదయ్య, రమేశ్, ఇన్‌స్పెక్టర్‌లు చిట్టిబాబు, రమేశ్, సతీశ్, ఎస్‌ఐలు విజయ్, చంద్రశేఖర్, ప్రశాంత్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## సీసీఎఫ్ హోదాలో మొదటిసారి జిల్లాకు

### ప్రభాకర్‌కు స్వాగతం పలికిన సీఎఫ్ శాంతారాం



పుష్పగుచ్ఛం అందజేస్తున్న సీఎఫ్ శాంతారాం

మంచిర్యాల అర్బన్, ఆగస్టు 20 : కాళేశ్వరం జోన్-2 చీఫ్ కన్జర్వేటర్ ఆఫ్ ఫారెస్ట్ (సీసీఎఫ్) అధికారి బిట్ల ప్రభాకర్ మంగళవారం మంచిర్యాల జిల్లా అటవీశాఖ కార్యాలయానికి మొదటి సారిగా రాగా, మంచిర్యాల సీఎఫ్ శాంతారాం పూలమొక్క అందజేసి స్వాగతం పలికారు. బిట్ల ప్రభాకర్ జిల్లాల పునర్విభజన జరగకముందు మంచిర్యాల డివిజన్ ఎఫ్‌డీవోగా, జిల్లాల విభజన అనంతరం జిల్లా అటవీ శాఖ అధికారిగా (డీఎఫ్‌వో) బాధ్యతలు నిర్వర్తించారు. అనంతరం ఆదిలాబాద్ సీఎఫ్‌గా పని చేసి, ప్రస్తుతం కాళేశ్వరం జోన్ సీసీఎఫ్‌గా కొనసాగుతున్నారు. మంచిర్యాల జిల్లాలో ఎఫ్‌డీవో, డీఎఫ్‌వోగా పనిచేసిన ప్రభాకర్ మొదటిసారి సీసీఎఫ్ హోదాలో జిల్లాకు రావడం ప్రాధాన్యం సంతరించుకున్నది. జిల్లా అటవీశాఖలో పని చేస్తున్న నలుగురు జూనియర్ అసిస్టెంట్లు.. సెక్షన్ ఆఫీసర్లుగా ఉద్యోగోన్నతి పొందేందుకు నిర్వహిస్తున్న పరీక్షను పర్యవేక్షించేందుకు జిల్లాకు వచ్చినట్లు సమాచారం.



జన్నారంలో రుణమాఫీ కోసం రాస్తారోకో చేస్తున్న రైతులు



కాగజ్‌నగర్ ఆర్డీవో కార్యాలయంలో వినతిపత్రం అందిస్తున్న బీఆర్ఎస్ నాయకులు

# రుణమాఫీ చేయాల్సిందే

- రైతులు, బీఆర్ఎస్ నాయకుల డిమాండ్
- పలుచోట్ల రాస్తారోకోలు.. ధర్నాలు
- రైతు వేదికల వద్ద సీఎం డౌన్.. డౌన్ అంటూ నినాదాలు
- తహసీల్దార్‌లకు వినతి పత్రాలు
- స్పందించకుంటే ఆందోళనలు తీవ్రతరం చేస్తామని హెచ్చరిక



పెంచికల్ పేట్ : తహసీల్దార్‌కు వినతి పత్రం అందజేస్తున్న నాయకులు, రైతులు

జన్నారం, ఆగస్టు 20 : శాసనసభ ఎన్నికలకు ముందు ఇచ్చిన హామీ మేరకు రూ. 2 లక్షల రుణాలు మాఫీ చేయాల్సిందేనని, లేదంటే ఆందోళనలు తీవ్రతరం చేస్తామని రైతులు స్పష్టం చేశారు. ఈ మేరకు మంచిర్యాల, కుమ్రం భీం ఆసిఫాబాద్ జిల్లాల్లో రాస్తారోకోలు, ధర్నాలు చేపట్టారు. జన్నారంలో మండల కేంద్రంలోని అంబేద్కర్ చౌరస్తా వద్ద ప్రధాన రోడ్డుపై రాస్తారోకో నిర్వహించారు. కవ్వాల్, దేవునిగూడ, కామన్‌పెల్లి, బంగారుతండా, హస్టల్ తండాకు చెందిన రైతులు తరలివచ్చి రోడ్డుపై బైఠాయించారు. ఈ కార్యక్రమంలో బోడ రాజు, లాకావత్ బియా, బోడ ప్రకాశ్, ఠాకూర్, లక్ష్మణ్, అంబాజీ, సురేశ్, లింబా తదితరులు పాల్గొన్నారు.



కోటపల్లి రైతువేదిక వద్ద నిరసన వ్యక్తం చేస్తున్న రైతులు

కోటపల్లి, ఆగస్టు 20 : రుణమాఫీ జాబితాలో తమ పేర్లు లేవంటూ రైతులు నిరసన వ్యక్తం చేశారు. కోటపల్లి రైతు వేదిక వద్దకు చేరుకొని సీఎం డౌన్.. డౌన్ అంటూ నినాదాలు చేశారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఇచ్చిన మాట ప్రకారం రూ.2 లక్షల పంట రుణాలు మాఫీ చేయాలని డిమాండ్ చేశారు. ఎలాంటి ఆంక్షలు లేకుండా ప్రతి రైతుకూ రూ.2 లక్షలను బ్యాంక్ ఖాతాల్లో జమ చేయాలన్నారు.

కాగజ్‌నగర్, ఆగస్టు 20 : పట్టణంలో బీఆర్ఎస్ నాయకులు, రైతులు ధర్నా నిర్వహించారు. రుణమాఫీ పేరిట కాంగ్రెస్ ప్రభుత్వం రైతులను మోసం చేసిందని మండిపడ్డారు. బీఆర్ఎస్ పార్టీ నియోజకవర్గ కన్వీనర్ లెండుగూరే శ్యాంరావు మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం లేనిపోని ఆంక్షలు విధించి రైతులను తీవ్ర ఇబ్బందులకు గురి చేస్తుందని ఆవేదన వ్యక్తం చేశారు. అనంతరం ఆర్డీవో కార్యాలయంలో వినతిపత్రం అందించారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు అంబాల ఓదెలు, మోయిన్, అవుల రాజ్‌కుమార్, కన్నయ్య, శ్రీనివాస్, అస్లాం, లలిత, అనిత, చంద్రకళ, స్వప్న పాల్గొన్నారు.

పెంచికల్ పేట్, ఆగస్టు 20 : బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్ పిలుపు మేరకు బీఆర్ఎస్ మండల కన్వీనర్ బిట్టి శ్రీనివాస్ ఆధ్వర్యంలో నాయకులు స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో తహసీల్దార్ వెంకటేశ్వర్ రావుకు వినతి పత్రం అందజేశారు. బిట్టి శ్రీనివాస్ మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం రుణమాఫీ చేశామని గొప్పలు చెప్పుకుంటున్నదని, కానీ లక్షలాది మంది అర్హులకు రుణాలు మాఫీ చేయకుండా మోసం చేసిందని మండిపడ్డారు. రైతులు వ్యవసాయ పనులు వదిలేసి రుణమాఫీ కోసం బ్యాంకులు, వ్యవసాయశాఖ కార్యాలయాల చుట్టూ తిరిగే పరిస్థితి తీసుకొచ్చారని మండిపడ్డారు. ఇకనైనా సర్కారు దిగిరాకుంటే బీఆర్ఎస్ ఆధ్వర్యంలో ఆందోళనలు తీవ్రతరం చేస్తామని హెచ్చరించారు. ఈ నాయకులు నగేశ్, పత్రు, నారాయణ, మహేశ్, తిరుపతి పాల్గొన్నారు.

## రెబ్బెన పీఏసీఎస్ సీఈవో సస్పెన్షన్

రెబ్బెన, ఆగస్టు 20 : రెబ్బెన ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం సీఈవో సంతోష్‌ను సస్పెండ్ చేసినట్లు ఇన్‌చార్జి జిల్లా సహకార సంఘం అధికారి(డీసీవో) మోహన్ మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. కెరమెరి పీఏసీఎస్ సీఈవో విజయ్‌కుమార్‌ను రెబ్బెన పీఏసీఎస్‌కు ఇన్‌చార్జి సీఈవోగా నియమించారు. అలాగే అవినీతి, అక్రమాల ఎంక్వైరీ అధికారిగా అసిస్టెంట్ రిజిస్ట్రార్ అనంతలక్ష్మిని నియమించారు. రెబ్బెన పీఏసీఎస్‌లో బయటపడిన అవినీతి ఆరోపణలతో సంతోష్‌పై సస్పెన్షన్ వేటు పడినట్లు ఆయన పేర్కొన్నారు. ఈ విషయమై పీఏసీఎస్ చైర్మన్ కార్నాథం సంజీవ్‌కుమార్‌ను వివరణ కోరగా రెబ్బెన పీఏసీఎస్ సీఈవో సంతోష్ సస్పెండ్ అయ్యారని, పాలకవర్గ సమావేశంలో తీర్మానం చేస్తామని పేర్కొన్నారు.

## ఐఎంసీ ఆయుర్వేదంపై ఉచిత శిక్షణ



మాట్లాడుతున్న డాక్టర్ అక్తర్ ఖాన్ వాలా

హాజీపూర్, ఆగస్టు 20 : ప్రపంచ ప్రఖ్యాతిగాంచిన, డబ్ల్యూహెచ్‌వో, జీఎంపీ సర్టిఫికెట్ కలిగిన ఐఎంసీ కంపెనీ ఆధ్వర్యంలో మంగళవారం జిల్లా కేంద్రంలోని మెగా ఆయుర్వేద కేంద్రంలో డాక్టర్ అక్తర్ ఖాన్ వాలా ఉచిత శిక్షణ నిర్వహించారు. ప్రస్తుత జీవనశైలీ, తీసుకున్న ఆహార పదార్థాలతో కలిగే నష్టాల గురించి వివరించారు. గుండె సంబంధిత వ్యాధుల నివారణ, డయాబెటిస్, క్యాన్సర్, కంటి సంబంధిత వ్యాధుల నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి తెలిపారు. ఆయుర్వేద ఆర్గానిక్ ఉత్పత్తులను వాడి ఆరోగ్యంగా ఉండవచ్చునని చెప్పారు. ఈ కార్యక్రమంలో చెర్మన్స్ కానుగంటి లక్ష్మణ్ వర్మ, బెల్లం కొండ రంజిత్‌కుమార్, ఎగుడ తిరుపతి, మైదం రాజేందర్, వడ్నాల సత్యనారాయణ పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న మంచిర్యాల కలెక్టర్ కుమార్ దీపక్

## భారీ వర్షాలపై అప్రమత్తంగా ఉండాలి

- ఆస్తి, ప్రాణ నష్టం జరగకుండా చర్యలు చేపట్టాలి
- వీసీలో మంత్రి పొంగులేటి, సీఎస్ శాంతికుమారి

నస్పూర్/ఆసిఫాబాద్ టౌన్, ఆగస్టు 20 : భారీ వర్షాలపై అప్రమత్తంగా ఉండాలని, ఎలాంటి ఆస్తి, ప్రాణనష్టం జరగకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని రాష్ట్ర రెవెన్యూ, సమాచార శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి అధికారులను ఆదేశించారు. మంగళవారం ఖమ్మం నుంచి మంత్రి, హైదరాబాద్ నుంచి రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి, జీహెచ్‌ఎంసీ కమిషనర్ ఆమ్రపాలి.. మంచిర్యాల, ఆసిఫాబాద్ కలెక్టర్లు కుమార్ దీపక్, వెంకటేశ్ ధోత్రేతో పాటు ఉన్నతాధికారులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. మంత్రి మాట్లాడుతూ రాష్ట్రంలో భారీ వర్షపాతం నమోదయ్యే ప్రాంతాల్లో వరద ప్రభావిత ప్రాంతాలను గుర్తించి ప్రజా రక్షణ చర్యలు చేపట్టాలని, ట్రాఫిక్ మళ్లించేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. మున్సిపాలిటీలు, గ్రామపంచాయతీల్లో పారిశుధ్య పనులు చేపట్టాలని, అంతర్గత రహదారులను శుభ్రం చేయాలన్నారు. ఈ నెల 23, 24 తేదీల్లో జిల్లా స్థాయిలో నూతన చట్టం గురించి వర్క్‌షాపు నిర్వహించాలని, నూతన చట్టం గురించి ప్రజలు, నిపుణులకు వివరించి వారి సలహాలు, సూచనలు స్వీకరించాలని తెలిపారు. ఎల్‌ఆర్ఎస్ దరఖాస్తులను ప్రభుత్వ మార్గదర్శకాల ప్రకారం క్రమబద్ధీకరించాలన్నారు. ధరణి పోర్టల్‌లో ఉన్న దరఖాస్తులను త్వరగా పరిష్కరించే విధంగా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. కలెక్టర్లు మాట్లాడుతూ వర్షాల నేపథ్యంలో జన జీవనానికి ఎలాంటి ఇబ్బందుల్లేకుండా ముందస్తు చర్యలు తీసుకుంటున్నామని, శిథిలావస్థలో ఉన్న ప్రభుత్వ భవనాలు, నివాస గృహాలపై ప్రత్యేక దృష్టి సారిస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా అదనపు కలెక్టర్లు మోతీలాల్, దాసరి వేణు, జడ్పీ సీఈవోలు గణపతి, లక్ష్మినారాయణ, ఆర్డీవోలు లోకేశ్వర్‌రావు, కాసబోయిన సురేశ్, ఆసిఫాబాద్ మున్సిపల్ కమిషనర్ భుజంగరావు పాల్గొన్నారు.

# ప్రయాణం నరకప్రాయం

- వర్షాలకు కొట్టుకుపోయిన చీలపల్లి, చిన్న మాలిని కల్వర్టులు
- రాకపోకలకు అష్టకష్టాలు పడుతున్న ప్రజలు
- మరమ్మతులు చేపట్టాలని వేడుకోలు



ఇటీవల వర్షాలకు కొట్టుకుపోయిన కల్వర్టు.. ఇబ్బందులు పడుతూ వాగు దాటుతున్న ప్రయాణికులు



చిన్న మాలిని వద్ద కొట్టుకుపోయిన వంతెన

కుమ్రం భీం ఆసిఫాబాద్ (నమస్తే తెలంగాణ)/సిర్పూర్(టీ), ఆగస్టు 20 : జిల్లాలోని సిర్పూర్(టీ) నుంచి మొట్టందని గ్రామం వరకు నిర్మిస్తున్న రోడ్డు అర్ధాంతరంగా నిలిచిపోయి ప్రయాణం నరకప్రాయంగా మారింది. దీనికి తోడు ఇటీవల కురిసిన వర్షాలకు చీలపల్లి, చిన్న మాలిని వాగుల వద్ద ఏర్పాటు చేసిన కల్వర్టులు సైతం కొట్టుకుపోగా, ఆయా గ్రామాల ప్రజలు అష్టకష్టాలు పడాల్సి వస్తున్నది. 20 రోజులు దాటినా పట్టించుకునే నాథుడే లేడని, ఇకనైనా స్పందించి మరమ్మతులు చేపట్టాలని ప్రయాణికులు వేడుకుంటున్నారు.

### ఆరు గ్రామాల ప్రజలకు అవస్థలు

జిల్లాలోని సిర్పూర్-టీ నుంచి మొట్టందని గ్రామం వరకు 24 కిలోమీటర్లు ఉంటుంది. మావోయిస్టు ప్రభావిత ప్రాంతాల అభివృద్ధి పథకం ద్వారా 18 కిలోమీటర్ల బీటీ రోడ్డు వేసేందుకు కేంద్ర ప్రభుత్వం నుంచి రూ. 15.42 కోట్లు, మిగతా 6 కిలో మీటర్ల రోడ్డుకు రూ. 1.81 కోట్లు మంజూరయ్యాయి. ఏడాది క్రితం పనులు ప్రారంభించినప్పటికీ.. అనుమతులు లేవంటూ అటవీ అధికారులు ఆ పనులను నిలిపివేశారు. ఈ రోడ్డు పూర్తయితే చీలపల్లి, రవణపల్లి, మేడిపల్లి, చిన్నమాలిని, పెద్ద మాలిని, లింబగూడ గ్రామాలకు రోడ్డు సౌకర్యం కలుగుతుంది. వాంకిడి మండలానికి వెళ్లేందుకు కూడా వీలుంటుంది. కానీ ఏడాది కాలంగా పనులు నిలిచిపోయాయి. ఇటీవల కురిసిన వర్షాలకు చీలపల్లి వాగు వద్ద నిర్మించిన తాత్కాలిక కల్వర్టుతో పాటు చిన్న మాలిని వాగు వద్ద మరో కల్వర్టు కొట్టుకుపోవడంతో ఆయా గ్రామాల ప్రజలు రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు పడాల్సి వచ్చింది. చిన్న మాలిని వద్ద ఉన్న వంతెన కొట్టుకుపోవడం వల్ల ఇటు ఆరు గ్రామాలతో పాటు ఇటు సిర్పూర్-టీ మండల కేంద్రానికి వచ్చేందుకు అవస్థలు తప్పడం లేదు. కనీసం కల్వర్టుల వద్దనైనా తాత్కాలిక మర్మతులు చేపట్టాలని ప్రయాణికులు వేడుకుంటున్నారు.

### కల్వర్టు కొట్టుకుపోయింది



*ఇటీవల కురిసిన వర్షాలకు చీలపల్లి వద్ద కల్వర్టు కొట్టుకుపోయింది. అతికష్టం మీద వాగు దాటాల్సి వస్తోంది. గతేడాది మా గ్రామానికి బీటీ రోడ్డు వేసేందుకు పనులు మొదలు పెట్టారు. అటవీశాఖ అనుమతులు లేవంటూ పనులు మధ్యలోనే ఆపేశారు. 20 రోజులు దాటినా కల్వర్టు వద్ద మరమ్మతులు చేస్తలేరు. ఇకనైనా అధికారులు స్పందించాలి.*

*- పోర్లె చంద్రవాస్, చీలపల్లి*


- జన్మదిన శుభాకాంక్షలు
- పొలిటికల్
- స్వదేశాగమనం
- లీగల్ ప్రకటనలు
- క్లాసిఫైడ్స్
- పదవీ విరమణ
- ప్రారంభోత్సవం
- శ్రద్ధాంజలి
- సినిమా
- వివాహ మహోత్సవం
- షష్టిపూర్తి మహోత్సవం మరియు
- అన్ని శుభకార్యాలు

నమస్తే తెలంగాణ
మన రాష్ట్రం.. మన పత్రిక...
నమస్తే తెలంగాణ దినపత్రికలో ప్రకటనల కోసం సంప్రదించండి..



ప్రకటనల విభాగం...
సెల్: 9182 777 571
మంచిర్యాల జిల్లా : 9182 777 676
కుమ్రంభీం ఆసిఫాబాద్ జిల్లా : 9182 777 679